జేసీగా ధాత్రిరెడ్డి

- జిల్లా ఎస్పీ శివకిశోర్ సతీమణి
- సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా లావణ్య వేణి బదిలీ
- ఐటీడీఏ పీవోగా హరిత
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ


ధాత్రిరెడ్డి


లావణ్యవేణి

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని సోషల్ వేల్ఫేర్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో ప్రస్తుతం పాడేరు సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న పెద్దిటి ధాత్రిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ సతీమణి ధాత్రి. వీరిద్దరూ ఖరగ్‌పూర్‌లో ఐఐటీ స్టూడెంట్‌లుగా వ్యవహరించారు. ధాత్రిరెడ్డిది నల్గొండ జిల్లా. అనుహ్యంగా ఎస్పీ, జేసీ ఇద్ద రూ దంపతులుగా ఇదే జిల్లాలో వ్యవహరించడం దాదాపు ఇదే తొలిసారి. జేసీ ధాత్రిరెడ్డి 2020 ఐఏఎస్ ఒడిశా కేడర్‌కు చెందినవారు. వ్యక్తిగత అభ్యర్థన మేరకు 2022లో ఆమెను ఒడిశా కేడర్ నుంచి ఏపీ కేడర్‌కు మార్చుతూ కేంద్రం సమ్మతించింది. లావణ్యవేణి ఏడాది క్రితమే ఏలూరు జేసీగా వచ్చారు. వివిధ శాఖల సమీక్షలు, పరిపాలన విధా నంలోనూ ఆమె చురుగ్గా వ్యవహరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గం ఆర్వోగా పని చేశారు. తాజాగా వేలేరుపాడులో పెద్దవాగు గండి, వరదల నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు చురుగ్గా కదిలారు. మరి కొంతకాలం ఇదే జిల్లాలో కొనసాగుతారని అనుకుంటున్న తరుణంలోనే ఆకస్మికంగా బదిలీ అయ్యారు.

ఐటీడీఏ పీవోగా హరిత

కేఆర్ పురం ఐటీడీఏ పీవోగా ఉన్న ఎం.సూర్యతేజను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. ఆయన స్థానంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల ఎండీగా ఉన్న డి.హరితను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐటీడీఏ పీవోగా సూర్యతేజ స్వల్ప కాలంలోనే బదిలీ కావడం విశేషం.

22 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు

ఏలూరు క్రైం, జూలై 20 : జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 22వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మౌఖిక ఆదేశాలు అనుసరించి సెలవులు ఇస్తున్నట్టు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి, సాధికారిత అధికారి కేపీవీఎల్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

ఏలూరు సిటీ : భారీవర్షాలు, వరదల కారణంగా తలెత్తే పరిణామాలను ముందస్తు ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఎటువంటి ప్రాణ, పశునష్టం జరగకుండా పటిష్ఠ చర్యలతో అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, పునరావాస కార్యక్రమాలు తదితర అంశాలపై శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. గోదావరి వరదను ఎదుర్కొనేలా ముందస్తు కార్యాచరణ అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి వరద మొదటి భద్రాచలం వద్ద 41 అడుగులకు చేరుకునే లోపులోనే గుమ్మిగూడెం వాసులను, దాచారంలోని పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. జేసీ లావణ్యవేణి , ఐటీడీఏ పీవో సూర్యతేజ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు : జేసీ

భారీ వర్షాలు, వరద సహాయక కార్యక్రమాల విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి హెచ్చరించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో పునరావాస కార్యక్రమాల అమలు తీరును టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

నిలువెత్తు.. నిర్లక్ష్యం!

జగన్ సర్కార్‌లో ఐదేళ్లపాటు ఇరిగేషన్ పనులపై నిలువెత్తు నిర్లక్ష్యం. బటన్ నొక్కుడుతో బ్రహ్మాండం పగుల కొట్టినట్లు పైపైకి గొప్పలు చెప్పడంతోనే కాలం గడిపేశారు. వ్యవసాయానికి మూలాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, భద్రతను పూర్తిగా వదిలేశారు. జగన్ సర్కార్ ఐదేళ్ల డొల్లతనం పెద్దవాగు గండితో బయటపడింది. ఇదొక పెనువిపత్తుగా మారి ఊళ్లకు ఊళ్ళనే తుడిపెట్టేసింది. జగన్ సర్కార్ పుణ్యమా అంటూ జిల్లావ్యాప్తంగా మిగతా మధ్యతరహా ప్రాజెక్టుల నిర్వహణలోనూ ఇలాంటి డొల్లతనమే కన్పిస్తోంది. ఐదేళ్ల నిర్లక్ష్యం అటు రైతులకు, ఇటు ప్రజలకు పెనుశాపం కాబోతుంది. దీన్ని అడ్డుకుని కొంతలో కొంత ప్రజలను బయటపడేసేందుకు కూటమి ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది.

\- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి


కొవ్వాడ రిజర్వాయర్ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న పోలీసులు

ఇరిగేషన్ ప్రాజెక్టులను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

- అది మేజర్ అయినా, మీడియం అయినా ఒకటే..
- జగన్ సర్కార్‌లో వీటిపై శ్రద్ధ లేదు..
- పెద్దవాగు ఘటనలో నిరాశ్రయులైన పేదలు
- ఇదేకోవలో కడెమ్మ స్లూయిజ్, కొవ్వాడ రిజర్వాయర్ గేట్లు
- కూటమి ప్రభుత్వం రాకతో మరమ్మతులు

ప్రాజెక్టులు అంటేనే అసలు పడలేదు

సాధారణంగా ఐదేళ్ల పాలనలో తమకు ఒక గుర్తింపు ఉండాలని, ఏనేత అయినా అధికారంలో ఉండగానే ప్రయత్నిస్తారు. అటు ప్రజల్లోనూ ఇటు ప్రభుత్వ యంత్రాంగంలోనూ తనకంటూ ఒక ముద్ర ఉండేలా జాగ్రత్త పడతారు. కాని ఐదేళ్ల జగన్‌ప్రభుత్వం ఇవేమి పట్టించుకోలేదు. తాము చెప్పిందే శాసనం. విన్నదే మరో శాసనం అన్నట్టు ఇష్టానురీతిన ప్రవర్తించింది. సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ చిన్నదైనా, పెద్దదైనా కొంత జాగ్రత్త తీసుకుని ఉండాల్సిందిపోయి అసలు ఆవైపు చూడనే లేదు. సంబంధితశాఖ అధికారులు తమ పరిధిలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, భద్రత విషయంలో కనీసం ఉన్నతస్థాయిలో సమీక్షించనూ లేదు. ఇలా నిర్వహణ లోపం తలెత్తితే దీర్ఘకాలికంగా కొనసాగితే పెనువిపత్తు వచ్చిపడినా ఆశ్చర్యం లేదనే సంకేతాలు సైతం ఇవ్వనేలేదు. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలోనూ ఒకవైపు గత ప్రభుత్వ డొల్లతనమే కాకుండా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే ప్రాజెక్టుకు గండిపడి విపత్తుకు దారితీసింది. వందలాది ఇళ్ళు కొట్టుకుపోయాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇది మానవ తప్పిదంగానే ఇప్పుడు అంతా భావిస్తున్నారు. ఒకవేళ ముందస్తుగానే ప్రాజెక్టు భద్రతకు సంబంధించి, నిర్వహణ గురించి పదేపదే సమీక్షల్లో ప్రస్తావించినా, నిధుల కోసం సంబంధిత మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ఒత్తిడి చేసినా వేలేరుపాడు మండలానికి ఇలాంటి పరిస్థితి దాపురించి ఉండేదే కాదు. కేవలం బటన్‌నొక్కుడు కార్యక్రమంలో ఏటా కోట్లాది రూపాయల పంపిణీపైన పెట్టిన శ్రద్ధలో ఇసుమంతైనా ప్రాజెక్టుల నిర్వహణపై ఆనాటి ప్రభుత్వం పెట్టనేలేదు. ఫలితంగా జరగరాని నష్టం ఇప్పుడు ప్రత్యక్షంగా జరిగింది. ఈ తరహా విపత్తుకు నిర్లక్ష్యమే ప్రధాన కారణం. ఏలూరు జిల్లా వ్యాప్తంగా పోలవరం ప్రాజెక్టు వంటి బహుళార్థక సాధక ప్రాజెక్టే కాదు.. మీడియం తరహా ప్రాజెక్టులు చాలాచోట్ల ఉన్నాయి. ఏటా ఈ తరహా ప్రాజెక్టులు నిండితేనే పంటలు, లేదంటే కరువే. కాని గడిచిన దశాబ్దకాలంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదు. తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో అధికారంలో ఉండగా, అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమ, సీజన్ వచ్చిందంటే చాలు ప్రాజెక్టులపైనే దృష్టిపెట్టేవారు. అప్పట్లో చంద్రబాబు చేసే పలుసూచనలను పరిగణలోకి తీసుకుని తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ఇంజనీర్లతో చర్చించేవారు. ప్రత్యేకించి ఒక్క పోలవరమే కాకుండా ఎక్కడ సాగునీరు అందించే జలాశయం ఉంటుందో దానిపైనే ఫోకస్ పెట్టేవారు. అధికారులు సైతం ఈ అంశంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేవారు. ఏజన్సీ ప్రాంతంలో చిన్నసన్నకారు రైతులకు సాగునీరు అందించేందుకు వీలుగా ఏనాడో ఆరంభించి నిలిచిపోయిన పోగొండ రిజర్వాయర్‌పైన దృష్టి పెట్టటమే కాకుండా ఎలాంటి గేట్లు లేకుండా ఓ చిన్నతరహా జలాశయంగా దీన్ని అభివృద్ధి చేసేందుకు తెలుగుదేశం హయాంలో కొంత కసరత్తు జరిగింది. ఈ కారణంగానే ఈ రిజర్వాయర్‌కు ఒకింత కళ వచ్చింది. ఎటుతిరిగి కాల్వలు తవ్వకపోవడమే మైనస్ అయినా రిజర్వాయర్ నిర్మాణంలో మాత్రం అనుకున్నది సాధించి, ముందు చూపు ప్రదర్శించారు. అలాగే ఏ చిన్న జలాశయాన్ని ఆనాడు చూసీచూడనట్లుగా వదిలేయలేదు. ప్రత్యేకించి ప్రాజెక్టులో నిర్వహణకు తగినంతగా నిధులు కేటాయించేవారు. దీనిపైనా ప్రత్యేక దృష్టిపెట్టి బడ్జెట్ కేటాయింపుల్లోనే ప్రాధాన్యత ఇచ్చేవారు.

నిర్వహణ లేక.. గేట్లు మొరాయించి ?

ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తే అధికారులు అంతే సమర్థతను చాటుకుంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రైతు పక్షాన నిలిచి తాము ఏం చేయదలుచుకున్నామో చెప్పి తదానుగుణంగా అభిప్రాయాలు సేకరిస్తే మేలైన ఫలితాలు ఉంటాయి. కాని ఐదేళ్ల జగన్ సర్కార్‌లో అంతా ఏకపక్షమే. రైతుల అభిప్రాయాలు అక్కర్లేదు. అధికారుల సూచనలు బుట్టదాఖలు. మంత్రులు సమీక్షలు కనిపించలేదు. ఈ కారణంగానే జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక ప్రాజెక్టుల్లో ఈ సీజన్‌లోనే అనేక అవాంతరాలు ఏర్పడ్డాయి. ప్రత్యేకంగా గేట్లు నిర్వహణలో ఉన్న డొల్లతనం బయటపడింది. ఐదేళ్ళపాటు నయాపైసా వీటి నిర్వహణకు కేటాయించలేదు. ఫలితంగా పోలవరం సమీపాన ఉన్న కడెమ్మ స్లూయిజ్‌కు రెండుగేట్లు ఉండగా, అవి ఈ మధ్యకాలంలో పూర్తిగా మొరాయించాయి. ఒకవైపు వరద ఎగువ భాగం నుంచి తన్నుకొస్తుండగా, ఆ నీరు అంతా దిగువన గోదావరిలో కలిసేందుకు వీలుగా కడెమ్మస్లూయిజ్ వద్ద ఉన్న రెండుగేట్లు ఆటంకంగా మారాయి. కొన్నాళ్ళపాటు వీటికి ఎలాంటి గ్రీజింగ్ చేయకపోవడంతో తుప్పుశాతం పెరిగి కనీసం పైకి లేవడం, లేదా కిందకు దిగడం వంటి చర్యలకు అనువుగా లేకుండా పోయాయి. దీంతో వేల ఎకరాలు నీట మునిగే ప్రమాదం ముంచుకొచ్చింది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించింది, ఈ గేట్లు నిర్వహణకు వీలుగా అధికారులను రంగంలోకి దింపింది. వీరి ప్రయత్నాలు ఫలించి కడెమ్మస్లూయిజ్ వద్ద గేట్లకు ఆటంకం పూర్తిగా తొలగిపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

- పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీ పేట వద్ద ఉన్న కొవ్వాడ రిజర్వాయర్ వద్ద తాజాగా గేట్లు నిర్వహణలోనే సమస్య ఎదురైంది. ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌కు వరద పోటెత్తితే ఈ ప్రాజెక్టుకు ఉన్న మూడుగేట్లు నిర్వహణ ఎలా ఉందో తెలుసుకోవడానికి ఇంజినీర్లు ట్రైల్ వేయగా ఒకగేటు మొరాయించింది. దీంతో సాంకేతిక ఆటంకాలను కొంత సవరించి గేట్లు యథావిధిగా పనిచేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీనికి కారణం కూడా గడిచిన కొన్నేళ్ళుగా నిర్వహణలో భాగంగా ఆ గేట్లకు ఎలాంటి గ్రీజింగ్ చేయకపోవడం, సాంకేతికంగా ఊతమిచ్చే కొన్ని పరికరాలు పనిచేస్తున్నాయో లేదో కొన్నాళ్ళకు ఒకసారి అయినా చెక్‌చేయకపోవడం ప్రధాన కారణంగా తేలింది. కాని గడిచిన కొన్నిరోజులుగా కొవ్వాడ రిజర్వాయర్‌కు కొండవాగు నుంచి వరదనీరు దూసుకువచ్చింది. గేట్లు పనితీరును ముందుగానే సరి చేయడంతో సరిపోయింది లేకుండా ఇక్కడ కూడా మరో విపత్తు సంభవించి ఉండేది.
- ముచ్చటగా మూడోది జల్లేరు జలాశయం ఈ జలాశయం నుంచి నీరు బయటకు వెళ్ళేందుకు వీలుగా రెండు గేట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ రెండుగేట్లు కూడా చాన్నాళ్లగా సాంకేతిపరమైన ఇబ్బందులకు గురవుతూనే ఉన్నాయి. ప్రత్యక్షంగా ముందస్తుగానే అక్కడ అధికారులు కొంతలో కొంత చొరవ తీసుకుని గేట్లపనితీరుపై ఓకన్నేసి ఉంచుతున్నారు కాని లేకుంటే ఈ జలాశయం రెండుగేట్లు కూడా పూర్తిగా మొరాయించి ఉండేవి. ఈ ప్రాజెక్టు పరిధిలో చాన్నాళ్ళుగా గేట్ల నిర్వహణలోనూ కొన్ని లోపాలు ఉండనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు అన్ని ఒక్కొక్కటిగా బహిర్గతం అవుతున్నాయి. రానురాను వానలు, వరదలు మరింత పెరిగితే అప్పుడు మరిన్ని లోపాలు బయటపడే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు ఎక్కడికక్కడ గేట్ల నిర్వహణ, ప్రాజెక్టుల భద్రతపై తక్షణం స్పందించి సమీక్షకు దిగి సత్వర చర్యలు తీసుకోవాలి.

పెద్దవాగు.. విధ్వంసం!

- బిక్కుబిక్కుమంటున్న పది గ్రామాల జనం
- ఇప్పట్లో గండి పూడిక అసాధ్యమే..
- మరల పొంచిఉన్న వరద ముప్పు


అల్లూరినగర్‌లో పెద్దవాగు వరద విధ్వంసమిది

ఇక దినదిన గండమే!

వేలేరుపాడు, జూలై 20: మండలంలో పెద్ద వాగు వరద మిగిల్చిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ప్రాజెక్టుకు గండి పడటంతో దాని దిగువ భాగంలో ఉన్న సుమారు 10 గ్రామాలు రానున్న రోజుల్లో నిత్యం ప్రమాదంతో పోరాడాల్సిన పరిస్థితి. ఇప్పటికే మేడేపల్లి, కమ్మరిగూడెం, ఒంటిబండ, అల్లూరినగర్, ఊటగుంపు, విప్పలగుంపు, గుళ్ళవాయి, కోయమాదారం, సొందేగొల్లగూడెం గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకు వచ్చి పలు ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఇళ్ళల్లోని వస్తువులన్నీ వరద పాలయ్యాయి. అయా గ్రామాల ప్రజలు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఇంతటితో ఈ గ్రామాలకు ప్రమాదం తప్పిపోలేదు. రానున్న రెండు నెలల కాలంలో వాగు ప్రాజెక్టుకు ఎగువ భాగంలో ఏ మాత్రం వర్షాలు కురిసినా ఆ నీరంతా ప్రాజెక్టులోకి చేరుతుంది. ప్రాజెక్టుకు గండి పడడంతో ప్రాజెక్టుకు ఉన్న మూడు గేట్లు తెరిచే ఉంచారు. దీంతో ప్రాజెక్టులోకి వచ్చే వరద నేరుగా కింద ఉన్న పెద్ద వాగులోకే వస్తుంది. ఈ వాగు పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పైన పేర్కొన్న గ్రామాలకు మరలా మరలా వరద పోటెత్తే ప్రమాదం ఉంది. ప్రాజెక్టుకు పడ్డ గండిని పూడ్చడం ఇప్పట్లో సాధ్యమయ్యే పనిగా కనిపించడం లేదు. గండిని పూడ్చేంత వరకు దిగువన ఉన్న గ్రామాలకు ప్రమాదం పొంచే ఉంటుంది.

కట్టుబట్టలతో మిగిలాం



పెద్దవాగు వరదల కారణంగా ఇళ్ళలోని వస్తువులన్నీ వరదకు కొట్టుకు పోయాయి. కట్టుబట్టలతో మాత్రమే మిగిలాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

\- సోయం సత్యం, అల్లూరి నగర్

ఆహార పొట్లాలే దిక్కు..



వరదలకు ఇళ్లు పూర్తిగా నేలమట్టం అయ్యాయి. ఇళ్ళలోని సామాన్లు, ధాన్యం, నగదు కొట్టుకు పోవడం చేతిలో చిల్లిగవ్వలేదు. వండుకోవడానికి గింజలు లేక ప్రభుత్వం అందించే ఆహార పొట్లాల పైనే ఆధారపడుతున్నాం.

\- కారం నరేష్, అల్లూరి నగర్

పరిహారమిచ్చి ఆదుకోవాలి..



మా ఇల్లు వరదల్లో కొట్టుకుపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులు, పశువులు వరదలో కొట్టుకుపోయాయి. నష్టపరిహారం చెల్లించి ఇళ్ళు కట్టించి ఇవ్వాలి.

\- సరియం రత్తయ్య, అల్లూరి నగర్


మేడేపల్లి సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి.. ఎమ్మెల్యేలు బాలరాజు, చింతమనేని, జేసీ లావణ్యవేణి

బాధితులకు పరిహారం

- మంత్రి కొలుసు పార్థసారథి
- పెద్దవాగు వరద ముంపు గ్రామాల్లో పర్యటన

వేలేరుపాడు, జూలై 20 : 'వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం.. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది.. బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారాలు చెల్లిస్తాం'.. అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వరద బాధితులకు భరోసా ఇచ్చారు. పెద్దవాగు వరదల కారణంగా నష్టపోయిన మేడేపల్లి, అల్లూరి నగర్‌లో ఆయన శనివారం పర్యటించి బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..' బాధితులు పూర్తిగా కుదుటపడే వరకు వరద సహాయక కేంద్రాల్లో భోజన వసతి సౌకర్యాలు కల్పించాం. సహాయక కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. తాగునీటికి ఎక్కడా కొరత లేకుండా అందించాలి. బాధిత కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె, నిత్యావసర సరుకులను అందించాలి. పారిశుద్ధ్యం పూర్తి స్థాయిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత స్థానిక అధికారులదే. గోదావరి వరద ముంపు వచ్చే అవకాశం ఉన్న వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల్లో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు'.. అని తెలిపారు. మేడేపల్లిలోని నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. కమ్మరగూడెం వద్ద వరద కారణంగా దెబ్బతిన్న వంతెనను పరిశీలించారు. అనంతరం మేడేపల్లిలోని సచివాలయంలో వరద సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు. 'సహాయక చర్యల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు. పూర్తి స్థాయిలో దెబ్బతిన్న ఇళ్ల యాజమానులకు టార్పాలిన్ పట్టాలు అందించాలి. గర్భిణులను ప్రభుత్వాస్పత్రికి తరలించాలి. పశువులకు పశుగ్రాసాన్ని అందించాలి. దెబ్బతిన్న రోడ్లకు అత్యవసర మరమ్మతులు నిర్వహించాలి. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి'.. అని మంత్రి సూచించారు.

వరదలకు అపారనష్టం

పెద్దవాగు వరదల కారణంగా జిల్లాలో 12 గ్రామాలు దెబ్బతినగా పంటలు, ఇళ్లు, రహదారులు దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. అధికారుల సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉందని ప్రాజెక్టు నిర్వహణ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉందని తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 7450 ఎకరాల్లో వరి పంట, 290 ఎకరాల్లో వరి నారు మడులు, 106 ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయ న్నారు. రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి ఐదు కిలోమీటర్ల మేర 126 ప్రదేశాల్లో రోడ్లు దెబ్బతినగా రూ.4 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. తాగునీటి పథకాలకు సంబంధించి 32 విద్యుత్ మోటర్లు కొట్టుకుపోగా రూ.23 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. బాధిత కుటుంబాలకు కార్యకర్తల సహాయంతో సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజును అభినందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, జేసీ లావణ్యవేణి, ఆర్డీవో అద్దయ్య, ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్, డీఎస్‌వో ఆర్ఎస్.సత్యనారాయణరాజు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మంజుభార్గవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, మండల అధికారులు పాల్గొన్నారు.

• వరదకు నేలకొరిగిన 47 విద్యుత్ స్తంభాలు

కుక్కునూరు : పెద్దవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల తీగలు తెగిపడి నేలకొరిగాయి. 33 కేవీ లైన్ సంబంధించి 17 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. 11కేవీ విద్యుత్ లైన్‌కు సంబంధించి వేలేరుపాడు మండలంలోని మేడిపల్లి వద్ద 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వీటిని పునరుద్ధరించడానికి కుక్కునూరు, వేలేరుపాడు, దర్భగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సిబ్బందితో పాటు దాదాపు 40 మంది కార్మికులతో యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టారు. విరిగిపోయిన, కొట్టుకుపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో మళ్ళీ కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు పునరుద్ధరించడానికి తీవ్రంగా శ్రమించారు. జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మన్‌రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణ, డీఈ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో రాత్రిపగలు శ్రమించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కాగా మండలంలో దెబ్బతిన్న రోడ్లపై కలెక్టర్‌కు నివేదిక పంపించినట్టు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.


విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎస్‌ఈ

కొనసాగుతున్న భారీ వర్షాలు

- ఉధృతంగా తమ్మిలేరు.. శాంతించిన ఎర్ర కాల్వ


ఏలూరు-కొవ్వలి రోడ్డులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఏలూరు సిటీ, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత ఉధృతం కావడంతో జిల్లాలో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో తమ్మిలేరుకు భారీగా నీరు చేరడంతో వరద ప్రమాదం పొంచిఉంది. ఎర్రకాల్వ శాంతించినా పరీవాహక ప్రాంతాలకు వరద కొనసాగుతోంది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా నూజివీడు మండలంలో 98.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైం ది. జిల్లాలో సరాసరి వర్షపాతం 52.4 మి.మీగా నమోదైంది. లింగపాలెం 79.4, వేలేరు పాడు 79, పెదవేగి 78.4, చాత్రాయి 67, కామవరపుకోట 62.4, ఆగిరిపల్లి 59.6, కొయ్యల గూడెం 57.4, బుట్టాయిగూడెం 54.2, ముదినేపల్లి 53.2, టి.నరసాపురం 53, పోలవరం 52.4, భీమడోలు 51.4, జంగారెడ్డిగూడెం 49.4, కుక్కునూరు 46.2, చింతలపూడి 46, పెద పాడు 45.2, ద్వారకాతిరుమల 44.6, ఏలూరు అర్బన్ 43, మండవల్లి 42.2, ఏలూరు రూరల్ 41.8, ముసునూరు 40.2, దెందులూరు 39.2, ఉంగుటూరు 38.8, జీలుగుమిల్లి 37.6, కలిదిండి 36.6, కైకలూరు 36.4, నిడమర్రు 33 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం 4,290 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. ఇందులో 196 హెక్టార్లలో వరి నారుమళ్ళు , 4,094 హెక్టార్లలో వరి నాట్లు వేసిన పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి.

పొంగుతున్న ఉప్పుటేరు


కలిదిండి మండలంలో పొంగుతున్న ఉప్పుటేరు

కలిదిండి : మండలంలో ఉప్పుటేరు పొంగుతోంది. భారీ వర్షా లు కురుస్తుండటంతో ఎగువన ఉన్న బుడమేరు, తమ్మిలేరు, రామిలేరులో నీరు కొల్లేరు ద్వారా ఉప్పుటేరులోకి వరద నీరు ప్రవహించడంతో ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఉప్పుటేరులో వలకట్లు కొట్టుకుని పోయే ప్రమాదం ఉండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఉప్పుటేరు నీటి మట్టం పెరిగితే చేపల, రొయ్యల చెరువుల గట్లు తెగిపోయే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

కొల్లేరుకు భారీగా వరదనీరు


పెద్దఎడ్లగాడి వద్ద నిండుగా కొల్లేరు

కైకలూరు : ఎగువ నుంచి దిగువకు భారీగా నీరు పారుదల కావడంతో కొల్లేరులో గణనీయంగా నీరు పెరుగుతోంది. దీంతో మండవల్లి మండలం పెనుమాకలంక, ఇంగిలిపాకలంక గ్రామాలకు ముంపు ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. పెద్దఎడ్లగాడి, చిన్నఎడ్లగాడి వద్ద భారీగా వరద నీరు చేరుతోంది. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో సర్కారు కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది.

జలదిగ్బంధంలో సత్యనారాయణపురం



దెందులూరు : కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. దెందులూరు పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురానికి గుండేరు వాగు కాల్వ దాటితేనే వెళ్లగలం. ఇటీవల వర్షాలకు గుండేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో గత రెండు రోజులుగా బయట వచ్చే అవకాశం లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం పీకల లోతులో వాగు దాటి వచ్చి తీసు కెళ్తున్నారు. తాగునీరు, నిత్యావసర సరుకులు, పశువులకు మేత లేదని, ఎన్ని ప్రభుత్వాలు మారినా గుండేరువాగు సమస్య తీరడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

ఒడిశా దంపతులకు శిశు గృహ బాబు దత్తత



పసిబిడ్డను అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, జూలై 20 : ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన పిల్లల్లేని దంపతులకు ఏలూరు శిశుగృహంలో పెరుగుతున్న మహేష్ అనే మూడు నెలల వయస్సు గల చిన్నారని కేరింగ్స్ ద్వారా రిజర్వ్ చేసుకున్న మీన కీర్తన్‌మహా రాణ, సంధ్యకుమారి మహారాణ దంపతులకు శనివారం కలెక్టర్ క్యాంపు ఆఫీసులో కలెక్టర్ వెట్రిసెల్వి దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకున్న బాబుని మంచి పోషణతో పెంచి విద్యాబోధనలు నేర్పించి వారిని ఉన్నతమైన స్థానంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీవో డాక్టర్ సూర్యచక్రవేణి, శిశుగృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు ప్రత్యామ్నాయాలు చూపండి

» డీఆర్‌ఎంను కలసిన 'ట్రైన్ మేట్స్ గ్రూపు' ప్రతినిధులు



రైల్వే డీఆర్‌ఎంను కలిసి ఇబ్బందులను వివరిస్తున్న ట్రైన్ మేట్స్ గ్రూపు ప్రతినిధులు

ఏలూరు అర్బన్, జూలై 20 : ట్రాక్ పనులు, సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునికీకరణల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లను కొన్ని రోజులపాటు పాక్షికంగాను, పూర్తిగాను రద్దు చేయడం, దారి మళ్లింపులతో ప్రయాణికులు, సీజనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని 'ట్రైన్ మేట్స్ గ్రూపు' ప్రతినిధులు తెలిపారు. శనివారం విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎన్.ఆనందరావుపాటిల్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. విజయవాడ నుంచి రాజమండ్రి వరకు వున్న పలు స్టేషన్ల నుంచి నిత్యం ప్రయాణించే సుమారు 200 మందితో కూడిన బృందం నుంచి గూగుల్ ఫారంలో సేకరించిన డేటా, సంతకాలతో కూడిన మెమోరాండంను డీఆర్‌ఎంకు అందజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అభ్యర్థించినట్టు వివరించారు. రైలు నెంబర్లు 12717-12718 రత్నాచల్, 17249-7250 తిరుపతి-కాకినా డ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని కోరామన్నారు. రైలు ననంబరు 07768 విజయవాడ-రాజమహేంద్రవరంల మధ్య నడిచే మెమూ ఎక్స్‌ప్రెస్ విజయవాడనుంచి బయల్దేరే సమయాన్ని ఉదయం 5.30 నుంచి 6 గంటల మధ్యలో ఉండేలా నిర్ణయం తీసుకుంటే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అభ్యర్థించామని తెలిపారు. ప్రయాణికుల వినతిపై సానుకూలంగా డీఆర్‌ఎం స్పందించారని ట్రైన్ మేట్స్ గ్రూపు ప్రతినిధి హలీమ్ వివరించారు.



జంగారెడ్డిగూడెంలో వేలం జరుగుతున్న దృశ్యం

పొగాకు @ 400

» రికార్డు ధర పలికిన వర్జీనియా పొగాకు

జంగారెడ్డిగూడెం, జూలై 20 : వర్జీనియా పొగాకు ధర శనివారం రూ.400కి చేరుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వర్జీనియా పొగాకుకు మంచి మార్కెట్ ఉండడంతో పొగాకు ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పొగాకు రైతులు, వేలం కేంద్ర అధికారులు ఎన్నడూ చూడనివిధంగా పొగాకు ధరలు పైపైకి వెళ్తున్నాయి. శనివారం స్థానిక రెండు వేలం కేంద్రాల్లో కిలో పొగాకు ధర రూ.399 ఉండగా గోపాలపురంలో రికార్డు ధర రూ.400 పలికింది. వేలం ప్రారంభమై శనివారానికి 105 రోజులు పూర్తయింది. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో 8.90 మిలియన్ల పొగాకు కొనుగోలు జరిగి టాప్‌లో నిలిచింది. వేలం కేంద్రం-2లో 8.75 మిలియన్లు, కొయ్యలగూడెంలో 8.35 మిలియన్లు, గోపాలపురంలో 7.47 మిలియన్లు, దేవరపల్లిలో 6.82 మిలియన్ల పొగాకు కొనుగోలు జరిగింది.

మామిడి రైతుల సదస్సు స్థలం మార్పు

నూజివీడు టౌన్, జూలై 20: భారీ వర్షాల నేపథ్యంలో మామిడి రైతుల సదస్సును మామిడి పరిశోధన కేంద్రం స్థానంలో బదులు అమర్ భవన్‌లో నిర్వహి స్తామని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు తెలిపారు. సోమవారం సాయంత్రం మూడు గంటల నుంచి అమర్‌భవన్‌లో మామిడి సదస్సును నిర్వహిస్తామని తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 20 : తన భర్త, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నా రంటూ స్థానిక ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన వేములమంద జ్యోతి అనే మహిళ టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సత్య అనిల్‌కుమార్‌తో ఆమెకు 2010లో వివాహమైంది. వీరి కాపురం కొంతకాలం సజావుగానే సాగింది. ఏడాది కాలంగా భర్త సత్యఅనిల్‌కుమార్, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ శ్రీనివాసులు తెలిపారు.

గోదావరి ఉధృతం



పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి ఉధృతంగా గోదావరిలోకి జలాలు

» పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,78,335 క్యూసెక్కుల వరద జలాలు విడుదల

నిండుకుండలా ఎర్రకాల్వ జలాశయం

పోలవరం/ఆచంట/జంగారెడ్డిగూడెం, జూలై 20 : ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి ఉధృతంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదుల జలాలు.. నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న6,78,335 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.200 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.570 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 30.638 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 20.800 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35.70 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 3.46 లక్షల క్యూసెక్కుల వరద జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి సోమవారం నాటికి మరో 9 లక్షల క్యూసెక్కుల వరద జలాలు రానున్నట్లు ధవళేశ్వరం బ్యారేజి అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఎగువ కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ లెవెల్ పెరిగి కాఫర్ డ్యాం కి సమీపంలో ఉన్న గండిపోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి నలువైపులా ఇసుక తిన్నెలు నీటమునిగాయి.

పశ్చిమలో నీట మునిగిన పుష్కర ఘాట్లు




ఆచంట మండలం కోడేరు వద్ద నీట మునిగిన పుష్కర ఘాట్

ఎగువ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం మరింత పెరిగింది. శనివారం ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి మరింత పెరగడంతో మండలంలో ఉన్న అన్ని పుష్కరఘాట్‌లు నీటి మునిగాయి. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పడవలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. వరద పరిస్థితిని రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పొంగుతున్న కొండవాగులు

పోలవరం మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ వాగులు, రిజర్వాయర్‌లు చెరువులు పొంగి పొర్లుతున్నాయి. శనివారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. గుంజవరం, పేద్రాల కాల్వలు పొంగుతున్నాయి. కొండవాగుల జలాలు గుంజవరం కల్వర్టుపై నుంచి ప్రవహించాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌లోకి కొండవాగుల జలాలు వచ్చి చేరడంతో రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ సామర్థ్య 90.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో 88.05 టీఎంసీల జలాలు ఉన్నాయని ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అదే నీటిమట్టాన్ని పరిమితిగా చేస్తూ మూడు స్లూయిజ్ గేట్లకుగాను ఒక గేటుని పది సెంటీమీటర్లు పైకి ఎత్తి 250 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఏఈ కొండలరావు తెలిపారు. కొండ వాగుల జలాలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కడమ్మ కాల్వ, కొవ్వాడ కాల్వల్లోకి వరద జలాలు చేరి పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్, కడమ్మ స్లూయిజ్‌ల ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పోలవరం డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్, ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ దేవప్రకాష్, కొవ్వాడ కాలువ రిటైర్డు డీఈఈ సీహెచ్ భాస్కరరావు ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్‌ని పరిశీలించారు. ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్ నీటి విడుదల వల్ల దిగువ ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులు తదితర అంశాలపై పోలీసులు ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తపట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, పోలవరం గూటాల గ్రామాల పరిధిలో నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. మండలంలో 60 ఎకరాల నారుమళ్ళు, 1,462 ఎకరాల వరినాట్లు నీట మునిగినట్లు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న తమ్మిలేరు జలాశయం



ఏలూరు సిటీ/చింతలపూడి, జూలై 20: చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియాతోపాటు ఎగువ తెలంగాణ నుంచి వస్తున్న వరద నీరు చేరి శనివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 344.24 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 3,426 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. రెండు రోజుల్లో తొమ్మిది అడుగుల నీరు పెరిగింది. 355 అడుగులకు చేరితే వరద నీరు దిగువకు విడుదల చేస్తారు. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు కాగా ఇప్పటికి 1.337 టీఎంసీలు నీరు చేరిందని ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు. ఇప్పటికే చాట్రాయి మండలంలో తమ్మిలేరు వరద కొనసాగుతోంది. ఎర్రకాలువ కొంత వరకు శాంతించింది. కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు వద్ద నీటిమట్టం 81.88 మీటర్లు కాగా ఎగువ ప్రాంతాల నుంచి 8,655 క్యూసెక్కులు నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతుండడంతో 10,696 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



కొంగువారిగూడెం వద్ద నిండుగా వున్న ఎర్రకాలువ జలాశయం

నిండుకుండలా ఎర్రకాల్వ జలాశయం

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్ర కాలువ జలాశయం నిండు కుండలా మారింది. శనివారం ఉదయం గంటకు 12,525 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. జలాశయం నాలుగు గేట్ల దారా 12,292 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. సాయంత్రానికి 10,800 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరగా 10,800 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టినట్లు తెలిపారు.

తరలిపోతున్న ఆ రెండు గ్రామాల ప్రజలు



సామగ్రి తరలిస్తున్న రేపాకగొమ్ము గ్రామస్థులు

వేలేరుపాడు : పెద్ద వాగు వరదలతో అతలాకుతలమైన వేలేరుపాడు మండలం అంతలోనే మరో ఆపదను ఎదుర్కోవాల్సి వచ్చింది. గోదావరి నదికి ఎగువ భాగాన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటి మట్టం భద్రాచలం వద్ద పెరుగుతోంది. శనివారం రాత్రికి 36 అడుగులకు చేరువలో ఉన్న నీటిమట్టం ఆదివారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకోవచ్చనే సంకేతాలు తెలంగాణ అధికారులు ఇచ్చారు. దిగువ భాగాన గల వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని ప్రజల్లో ఆందోళన నెలకొంది. వరదపెరిగితే రహదార్లు మూసుకుపోతాయనే భయంతో రేపాకగొమ్ము గ్రామస్థులు దాచారం పునరావాస కాలనీకి తరలిపోతుండగా రుద్రమ్మకోట గ్రామస్థులు బయట ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకపోవడంతో సమీపంలోని గుట్టపైన గుడారాలు వేసుకుని తరలిపోతున్నారు. గోదావరి వరద 50 అడుగుల వరకు పెరిగే అవకాశాలుండడంతో మిగిలిన గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయే ఏర్పాటు చేసుకుంటున్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి : డ్వామా పీడీ

కుక్కునూరు : భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, సెలవులు పెట్టరాదని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రాము ఆదేశించారు. శనివారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖాధికారులు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వరదలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగానే ఏఏ గ్రామాలు ముంపుకు గురవుతాయో ఆ గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. వరద బాధితులకు ఏర్పాటు చేసే భవనాలు, భోజనం వండి పెట్టడానికి బియ్యం నిల్వలు, నిత్యావసరాలు, తాగునీటి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ అచ్యుతకుమారి, ఎంపీడీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

విపత్తు నివారణ దళం సిద్ధం

ఏలూరు క్రైం : ప్రకృతి వైపరీత్యాల సమయంలో విపత్తు నివారణ దళం సభ్యుల సేవలు ప్రముఖమైనవి. ముఖ్యంగా తుఫాన్‌లు, వరదల సమయంలో ప్రాణ నష్టాలను నివారించడంలో వీరి పాత్ర ప్రముఖమైనది. ప్రసుతం గోదావరి వరద ఉధృతి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో వరదలు కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం కలుగకుండా ఉండేందుకు జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు జిల్లాకు వచ్చాయి.

ఎటు పోతున్నాం..

» మంటగలుస్తున్న మానవ సంబంధాలు

» చిన్నపాటి గొడవలకే హత్యలకు దారితీస్తున్న వైనం

ఉమ్మడి పశ్చిమలో వేర్వేరుచోట్ల మూడు దారుణ హత్యలు

క్రైం కార్నర్

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో శనివారం వేర్వేరుచోట్ల మూడు దారుణహత్యలు జరిగాయి. మానవ సంబంధాలను మంటగలిపే విధంగా సొంత కుటుంబ సభ్యులే చిన్నపాటి గొడవలతో హత్యలకు తెగించారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో మామను అల్లుడు ఇనుపరాడ్డుతో కొట్టి చంపాడు. కామవరపుకోట మండలం తడికలపూడిలో మద్యం మత్తుకు బానిసైన కుమారుడు తండ్రిపై దాడి చేసి చంపాడు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం వేములదీవిలో ఓ వ్యక్తిని ఒంటరి మహిళ కత్తితో నరికి చంపింది.

మామను కడతేర్చిన అల్లుడు



లాజర్ మృతదేహం, ఫైల్ ఫోటో



సుబ్బారావు(ఫైల్)

ద్వారకాతిరుమల, జూలై 20: జీవనోపాధి నిమిత్తం ఓ వివాహిత కువైట్‌కు పయనమై వెళ్లడం.. ఆమె తండ్రి ప్రాణానికి ముప్పు తెచ్చిన ఘటన ఐఎస్ జగన్నాథపురంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పాతకోకుల లాజర్(65)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గేదెలు మేపుకుంటూ జీవించే అతడి భార్య గతంలోనే మృతి చెందింది. 20 ఏళ్ల క్రితమే తన పెద్ద కుమార్తె గంగాభవానీని మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన కొక్కిరపాటి సుబ్బారావుకిచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసైన సుబ్బారావు తరచూ భార్యపిల్లలను కొడుతూ హింసించసాగాడు. వీటిని తట్టుకోలేక ఆమె పిల్లలతో కలసి ఏడాది క్రితమే పుట్టింటికి వచ్చి కూలీపనులు చేసుకుంటోంది. కుటుంబపోషణ నిమిత్తం ఆమె కువైట్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవడం భర్తకు ఇష్టం లేక ఆమెను చంపేందుకు శుక్రవారం రాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత అత్తారింటికి వెళ్లాడు. అప్పటికే ఆమె జంగారెడ్డిగూడెం వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ బస్సు ఎక్కేసింది. ఇంట్లో ఆమె లేకపోవడంతో ఎక్కడికెళ్లిందని అరుస్తూ చంపేస్తానంటూ కుటుంబసభ్యులను బెదిరించాడు. కువైట్‌కు బయలు దేరిందని తెలుసుకుని... మామ లాజర్‌ను చంపితే తిరిగి వచ్చేస్తుందని భావించి తనతో తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో లాజర్‌ను కొట్టడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, భీమడోలు సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బంది సాక్ష్యాలు సేకరించే పనిలో పడ్డారు. మృతుడు కుమారుడు వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అతడి కోసం ఇప్పటికే పోలీసు బృందాలు వెదుకులాట ప్రారంభించాయి.

తండ్రిని కడ తేర్చిన కుమారుడు



నాగనబోయిన శ్రీను(ఫైల్)

కామవరపుకోట, జూలై 20 : మద్యం మత్తులో ఓ యువకుడు కన్నతండ్రినే హతమార్చిన సంఘటన శనివారం తడికలపూడిలో చోటు చేసుకుంది. తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపిన వివరాల వివరాలివి.. తడికలపూడి వేంపాడు రోడ్డులో నాగనబోయిన శ్రీను(45), అతడి కుమారుడు కార్తీక్ ఇద్దరూ నివాసం ఉంటున్నారు. శ్రీను భార్య గతంలోనే మృతి చెందింది. శ్రీను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కార్తీక్ అల్లరి చిల్లరగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. తండ్రితో తరచూ ఆస్తి కోసం గొడవలు పడుతున్నాడు. శ్రీను పేర 86 సెంట్ల స్థలం ఉందని, ఆ స్థలాన్ని తనకు రాయాలని తరచూ వేధిస్తున్నాడు. ఈ మేరకు శనివారం శ్రీనుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేములదీవిలో దారుణహత్య

» ఓ వ్యక్తిని కత్తితో నరికి చంపిన ఒంటరి మహిళ



చంద్రశేఖర్ హత్యకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ గోవిందరాజు

నరసాపురం రూరల్/మొగల్తూరు, జూలై 20: నరసాపురం మండ లం వేములదీవి గ్రామం సర్దుగొడప ప్రాంతంలో శనివారం దారుణ హత్య జరిగింది. గ్రామానికి చెందిన తిరుమాని చంద్రకళ ఒక వ్యక్తిని కత్తితో నరికి చంపింది. హత్యకు గురైన వ్యక్తి నరసాపురం మండలం చినలంక గ్రామానికి చెందిన మైలా చంద్రశేఖర్(30)గా పోలీసులు గుర్తించారు. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాలివి.. సర్దుగొడపలో హంతకురాలు చంద్రకళ ఒంటరిగా నివాసం ఉంటుంది. ఉదయం ఆమె ఇంటి ముందు హత్య జరిగిన ట్లు గుర్తించిన స్థానికులు విషయాన్ని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో చంద్రకళ ఈ హత్య చేసినట్లు తేలిందన్నారు. ఎందుకు హత్య చేసిందన్నది విచారిస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధి నిమిత్తం భార్య గల్ఫ్‌లో ఉంటుంది. తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

మొగల్తూరు, జూలై 20: దంపతుల మధ్య ఆర్థిక లావాదేవీలతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలివి.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పేరూరు గ్రామానికి చెందిన గురజాడ అప్పారావు(32) మొగల్తూరు మండలంలోని కొత్తపాలెం గ్రామంలో అతడి అత్తవారింటవద్దనే గత పన్నెండేళ్లుగా నివాసం ఉంటున్నాడు. భార్య కువైట్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరి మధ్య ఆర్థిక అంశాలకు సంబంధించి వివాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన అప్పారావు శనివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మునిసిపల్ కార్మికుడి మృతి



శ్రీను మృతదేహం

తణుకు, జూలై 20 : విధులు నిర్వర్తిస్తున్న ఓ మునిసిపల్ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన తణుకు పట్టణ పరిధిలోని పైడిపర్రులో జరిగింది. పైడిపర్రు శ్మశానం సమీపంలో పారిశుధ్య పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో చిటికెల శ్రీను (42) అక్కడికక్కడే మృతి చెందాడు. జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద అతడి మృతదేహాన్ని సీఐటీయూ నాయకులు పీవీ ప్రతాప్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధనాల వెంకటరావు సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ బి.వి.రమణను బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం, భార్యకు ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదినారాయణ బాబు, మందులయ్య, అయ్యప్ప, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా నిధులు రూ.45 వేలు స్వాహా

» వీవోఏ శిరీషపై డ్వాక్రా సంఘ లీడర్ల ఫిర్యాదు



డ్వాక్రా వీవోఏపై ఏపీఎంకు ఫిర్యాదు చేస్తున్న సంఘ లీడర్లు

ద్వారకాతిరుమల, జూలై 20: దొంగతీర్మానాలు తయారు చేసి చెక్కులపై సంతకాలు ఫోర్జరీ చేసి డ్వాక్రా వీవోఏ చిన్ని శిరీష దర్జాగా రూ.45 వేలు స్వాహా చేసిన ఘటన వేంపాడులో జరిగింది. ఈమేరకు శనివారం వెలుగు ఏపీఎం అరవిందమ్మకు డ్వాక్రా గ్రామ సంఘ లీడర్లు కె.నాగశిరోమణి, ఎం.వెంకటలక్ష్మితో పాటు పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వేంపాడు గ్రామ సంఘ పరిధిలో సుమారు 38 డ్వాక్రా గ్రూపులు ఉండగా ముగ్గురు లీడర్లున్నారు. వీరు మాత్రమే సంఘలావాదేవీలకు తీర్మానం చేసి సంతకాలు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ముగ్గురికి తెలియకుండా వీవోఏ చిన్ని శిరీష వారి సంతకాలు ఫోర్జరీ చేసి భీమడోలు యూనియన్ బ్యాంకు నుంచి రూ. 45 వేలు విత్‌డ్రా చేసింది. విషయం తెలుసుకున్న గ్రామసంఘ లీడర్లు ఆమెను నిలదీశారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారు ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. గ్రామసంఘ లీడర్లుగా తాము ఉన్నప్పటినుండి ఖాతాలో రూ.8లక్షలు వరకూ ఉండేవని ప్రస్తుతం రూ.1.30 లక్షలు మాత్రమే ఉన్నాయని దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వెలుగు ఏపీఎం అరవిందమ్మ మాట్లాడుతూ శిరీషపై స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానన్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం.. ఓ వ్యక్తిపై కేసు

భీమవరం క్రైం, జూలై 20 : గల్ఫ్ పంపిస్తానని డబ్బు తీసుకుని మోసం చేశాడంటూ బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భీమవరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భూషణం శనివారం తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన సంగాని ఏసుపాదం గల్ఫ్ వెళ్లే ప్రయత్నంలో ఉండగా ఆకివీడుకు చెందిన కారాడి దుర్గారావు గత ఏడాది డిసెంబరు నెల వరకు దఫదఫాలు సుమారు రూ.1.70 లక్షలు తీసుకున్నారు. అప్పటి నుంచి గల్ఫ్ పంపించకుండా మోసం చేశాడని ఏసుపాదం భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

ఎంపీడీవో ఫోన్ కాల్స్‌పై దృష్టి

» ఇంకా దొరకని ఆచూకీ.. కొనసాగుతున్న గాలింపు

» రేవు రికార్డులు స్వాధీనం చేసుకున్న ఉయ్యూరు పోలీసులు



నరసాపురం రూరల్, జూలై 20: ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఆరో రోజు కూడా ఆయన ఆచూకీ చిక్కలేదు. కృష్ణా జిల్లా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడలోని పంట కాల్వలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చేస్తూనే, అదృశ్యానికి ముందు ఎంపీడీవోకు వచ్చిన ఫోన్ కాల్స్‌పై దృష్టి పెట్టారు. ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఇటు మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించిన కొన్ని రికార్డులను ఉయ్యూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేవుకు సంబంధించిన లావాదేవీలను అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. సిబ్బంది ఇచ్చిన సమాచారం ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. తరచూ ఎంపీడీవోకు కొన్ని ఫోన్ కాల్స్ వచ్చేవని, అవి వచ్చినప్పుడల్లా భయాందోళన చెంది సిబ్బంది పనిచేసే చోటే కూర్చొనేవారని, ఒకసారి అప్పుచేసి పెద్దమొత్తంలో నగదు పంపాడు. దీన్ని గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపడుతున్నారు. ఎందుకు ఫోన్ చేస్తున్నారో.. ఎంపీడీవోను బెదిరించి డబ్బులు గుంజుకోవడం ? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. వచ్చిన ఫోన్ కాల్స్ అన్నీ ఇతర రాష్ట్రాలకు చెందినవిగా గుర్తించి వారి వివరాలను సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. వీరికి, పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైన ఎంపీడీవో అదృశ్యమై వారం రోజులు గడిచినా.. ఇంకా ఆచూకీ చిక్కకపోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ తప్పిదాల వల్లే ఇబ్బందులు


తమ్మిలేరు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 20: వైసీపీ ప్రభుత్వ తప్పిదాల వలన వ్యవస్థలన్నీ దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కాల్వల్లో గుర్రపు డెక్క, తూడు, తొలగించ లేక పోయారన్నారు. పోణంగి బ్రిడ్జి వద్ద తమ్మిలేరు నీటి ప్రవాహం పరిశీలించారు. నీటి ప్రవాహం సరిగా లేకపోవడంతో తక్షణమే గుర్రపు డెక్క, తూడు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో వరదలకు పోణంగి గ్రామం మునిగిపోయేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి ముందు చూపుతో నిర్మించిన బ్రిడ్జి కారణంగా ప్రస్తుతం ప్రమాదం తప్పిందన్నారు. సీఆర్ఆర్ కాలేజీ వంతెన వద్ద కాల్వలో గుర్రపు డెక్క తొలగించాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చోడే వెంకటరత్నం, సాంబశివరావు, బోసుబాబు, పైడి వెంకట్రావు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే కూటమి ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే చంటి అన్నారు. పవరుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చాలా సమస్యలను సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. మాజీ డిప్యూటీ మేయర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ధర్మరాజు పర్యటన

భీమడోలు, జూలై 20 : ఎంఎంపురం, లింగంపాడు, గుండుగొలను, ఆగడాలలంక, చెట్టున్నపాడులో నీట మునిగిన ప్రాంతాలను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదివారం పరిశీలించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి శ్రేణులు పాల్గొనాలన్నారు.

ప్రజలకు అందుబాటులో నిత్యావసర ధరలు

కొయ్యలగూడెం, జూలై 20: సామాన్యులకు అందుబాటులో నిత్యవసర షాపులు ఏర్పాటు చేస్తున్నామని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. కొయ్యలగూడెంలో శనివారం షాపును ప్రారంభించి మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, తక్కువ ధరలకే అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం ప్రారంభం


ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం, జూలై 20 : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఏరియా ఆస్పత్రిలో పీవీఆర్ కార్డియాక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి సోమవారం ఉచితంగా గుండె వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను, వైద్యులను పీవీఆర్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ పీవీఆర్ చౌదరి సన్మానించారు. ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ బేబీ కమల, టీడీపీ నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, దితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు తిరిగి వారి జిల్లాలకు బదిలీ

ఏలూరుసిటీ, జూలై 20: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వివిధ జిల్లాల నుంచి ఏలూరు జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లను తిరిగి వారి జిల్లాలకు బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు కె.పోసిబాబు, కె.రాజ్యలక్ష్మి, ఎండీ మక్సూద్ అలీ, కాకినాడ జిల్లాకు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.సూర్యప్రభ, ఎస్.పోతురాజు, ఎన్ఎల్ఎన్ కుమారి, ఏవీ శాస్త్రి, వీఎస్‌వీవీకేవీఆర్ మురాజీ, వి.జితేంద్ర, జి.చిన్నారావు, జి.వరహాలయ్య, జీవీఎస్ ప్రసాద్, ఆర్‌వీ వెంకటేశ్వరరావు, టి.సుభాష్, పీవీవీ గోపాలకృష్ణ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కె.కాశీవిశ్వేశ్వరరావు, డి.ఏసుబాబు, బి.మృత్యుంజయరావు, కృష్ణా జిల్లాకు సీహెచ్ నరసింహరావు, వి.భావన్నారాయణ, కె.వెంకటశివయ్య, పీఎన్‌వీ ప్రసాద్, జి.రవికాంత్‌లను వారి వారి జిల్లాలకు బదిలీ చేశారు.

పార్ట్ టైమ్ వీఆర్వోలకు గౌరవ వేతనం పెంచాలి

ఏలూరు రూరల్, జూలై 20: పార్ట్ టైమ్ రెవెన్యూ అధికారుల గౌరవ వేతనం రూ. నాలుగు వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని కోరుతూ శనివారం మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో గ్రామ, రెవెన్యూ, అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎం.బాపూజీ, అర్జున్‌రావు, నళిని, బాలాజీరెడ్డి, తదితరులున్నారు.

గురుకుల పాఠశాలలోకి చేరిన వర్షం నీరు

చింతలపూడి, జూలై 20: స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. గత ప్రభుత్వం ఎన్నికల ముందు హాస్టల్ భవనాలు పూర్తి కాకుండానే హడావుడిగా ప్రారంభిస్తూ తరగతులు ఈ నూతన భవనంలోకి నిర్వహిస్తున్నారు. ఇంకా సగం నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. అయితే పాఠశాల ప్రాంగణం ఆవరణ అంతా మెరకలేక పోవడంతో వర్షపునీరు చేరి చెరువును తలపిస్తుంది.

వరద బాధితులకు సాయం

జీలుగుమిల్లి, జూలై 20 : పోలవరం ఎమ్మెల్యే వెంట మేమున్నామంటూ కూటమి నాయకులు వరద బాధితు లకు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. పెదవా గు ప్రాజెక్టు వరద ముంపు నకు నష్టపోయిన వారికి సాయంగా ఎమ్మెల్యే వెంట మండల కూటమి నాయకు లు వెళ్లారు. మేడిపల్లిలో వరద బాధితులు 200 మందికి భోజనం అంద జేశా రు. కామయ్యపాలెంకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ గూడపాటి అరుణ్‌కుమా ర్, బండారు అనిల్, ఎల్.లక్ష్మీనారా యణ, సీహెచ్.మధు, జె.కిట్టు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కుక్కునూరు, జూలై 20: ఉప్పేరు పంచాయతీలోని రెడ్డిగూడెంలో కురిసిన భారీ వర్షాలకు పలువురు గిరిజనులు నిరాశ్రయులయ్యారు. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో వారంతా సమీపం పాఠశాల భవనంలో ప్రభుత్వం పునరావాసం కల్పించింది. అయితే జనసేన నాయకులు శనివారం ఐదు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు.

జల్లేరు జలాశయం నీరు విడుదల

బుట్టాయగూడెం, జులై 20 : శ్రీగుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నుంచి శనివారం కూడా అధికారులు 230 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వాగులు తగ్గుముఖం పట్టంతో ఇన్‌ఫ్లో కూడా తగ్గి 280 క్యూసెక్కులు జలాశయంలోకి వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ తులసీ తెలిపారు. జలాశయం నీటిమట్టం 215.6 ఎంటీఎస్ ఉన్నట్లు తెలిపారు. వర్షం కురుస్తున్నందున ఇన్‌ఫ్లో పెరిగితే నీటి విడుదలను పెంచు తామని ఏఈ తెలిపారు.

సారె సమర్పణ

జంగారెడ్డిగూడెం, జూలై 20 : లక్కవరంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శనివారం గ్రామస్తులు సారె సమర్పించారు.

జ్వరాల అదుపునకు చర్యలు

లింగపాలెం, జూలై 20: గ్రామాల్లో జ్వరాల అదుపునకు ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సమీక్ష చేస్తున్నట్లు కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్ తెలిపారు. ఆసన్నగూడెంలో శనివారం ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో మెడికల్ సిబ్బంది జ్వరా బాధితుల సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఉమామహేశ్వరరావు, దివ్య, చంద్రశేఖర్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఉంగుటూరులో నీట మునిగిన వరి పొలాల దుబ్బులను చూపుతున్న రైతులు


పెద్ద చెరువు ఆయకట్టులో వరద నీటిలో మునిగిన పంట పొలాలు


కైకరంలో ముంపులో ఉన్న పంటపొలాలను పరిశీలించిన ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు


బుట్టాయగూడెంలో వర్షాలకు దెబ్బతిన్న పొగాకు బ్యారన్

మునిగిపోయాం

» అన్నదాతల ఆవేదన » ముంపులో పంట పొలాలు

అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఈ సీజన్‌లో ఈ స్థాయిలో వర్షం పడడం ఇదేకావడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చిరువ్యాపారులు రోడ్లపై విక్రయాలతో జీవనం సాగించేవారు.. కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు రావడంతో తమ్మిలేరుకు వరద ప్రవాహం వస్తోంది. రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఏలూరు రూరల్, జూలై 20: మండలంలో ఏడు వేల ఎకరాలు వరి పంట సాగు చేస్తుండగా, ఇటీవలే కొన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా వరినాట్లు వేశారు. తాజాగా కురిసిన వర్షాలకు సుమారు 20 ఎకరాల్లోని నారుమడులు నీటమునిగాయి. మండల వ్యవసాయశాఖ అధికారులు శనివారం చొదిమెళ్ళ, మాదేపల్లి గ్రామాల్లో నీట మునిగిన వరి నారుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. చొదిమెళ్ళలో పంట పొలాలు పూడుకుపోవడంతో వర్షం నీరు బయటకు వెళ్ళే మార్గం లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు హుటాహుటిన పంట కాలువ పూడికను తొలగించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏలూరు రూరల్ మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు చేరింది. ఆయా ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కూడా మునిగి తటాకాలను తలపిస్తు న్నాయి.

● చింతలపూడి : వర్షాలకు మండలంలోని చెరువులు నిండి అదనపు నీరు వాగులు, కాలువలు ద్వారా పొంగి ప్రవహిస్తోంది. ఆక్రమణలు, కాలువల్లో పూడిక పేరుకు పోవడంతో పొలాల మీదుగా ప్రవహిస్తుండడంతో పంటలు నీట మునుగుతున్నాయి. మూడు రోజుల్లో 270 మిల్లీమీటర్ల కు పైగా వర్షం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ. అయితే ఇంకా వర్షాలు పడే సమాచా రంతో రైతుల్లో ఆందోళన నెలకొని ఉంది. అధికవర్షాలు పడితే బలహీనంగా ఉన్నచోట్ల చెరువుగట్లు తెగి ఉన్న సాగు నీరు పోతుందేమోనని ఆందోళనలో ఉన్నారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఇప్పటికే అధికారులను అప్రమ త్తం చేశారు. రైతులకు పంట పొలాల్లో నీటిని వదిలే యాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో సుమారు 445 ఎకరాల్లో పంట నీటమునిగింది. 65 ఎకరాల్లో నారు మడులు నీటము నిగాయని అధికారులు అంచనా వేశారు. కాంతంపాలెం, గణిజర్ల, చింతలపూడి, రాఘవాపురం, యర్రగుంట పల్లి, ప్రగడవరం, శివపురం గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. సుప్రీమ్‌పేటకు ఆనుకుని ఉన్న రాళ్ళ కుంట చెరువు వల్ల ఇళ్లు ముంపునకు గురవు తాయన్న సమాచారంతో అధికారులు నీటి పారుదలశాఖ ఏఈ పరమానందం, ఎస్సై కుటుంబరావు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించి ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకున్నారు. వెంకటాద్రిగూడెం వద్ద రోడ్డుపై పామాయిల్ చెట్టు డిపోవడంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బంది చొరవతో జేసీబీతో తొలగించారు.

● చింతలపూడి పట్టణంలోని పెద్ద చెరువు అలుగు నీరు పారే కాలువ పూడుకుపోవడంతో వరద నీరు దిగువన ఉన్న పంట పొలాలను ముంచిందని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నా రు. ఈ చెరువు కింద వెయ్యి ఎకరాలు సాగవుతోంది. ఈ పెద్దచెరువు గర్భంలోనూ నీరుపోయే కాలువలో చెత్తాచెదారం, భవన వ్యర్థాలతో పూడిపోయింది. ఇప్పటికే చెరువు ఆక్రమణకు గురై సాగునీటి సామర్థ్యం తగ్గి పోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండిపోయి అదనపు నీరు పోయే వరద కాలువ పూడుకుపో వడంతో సుమారు 200 ఎకరాల పంట నీట మునిగిందని రైతులు తెలిపారు. చెరువు సమస్యను చూసేందుకు సాగునీటి సంఘాలు లేవని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ కాలువ పూడిక తీస్తే ముంపు బారి నుంచి పంటను కాపాడు కుంటామని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు రైతులు అంజిబాబు, హనుమం తురావు, జానీ, జనార్దన్‌రావు తెలిపారు.

● నిడమర్రు : వర్షాలకు నారుమడు లు, ఊడ్చిన పొలాలన్నీ నీట మునిగాయి. మురుగునీటి కాలువలు కూడా పై నుంచి వస్తున్న వరదనీటితో నిండి పోవడంతో వరి చేలల్లో నీర్లు పోయే మార్గం కనబ డడం లేదు. మండల వ్యవసాయ శాఖాధి కారులు ఉదయం నుంచి నీటి మునిగిన పొలాలను పరిశీలించి నష్టం అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల వ్యవసాయ అధికారి ఎస్. గీతాదేవి మాట్లాడుతూ మండలంలో 178 ఎకరాలలో నారుమడులు పోయగా వర్షాల వల్ల సుమారు 90 ఎకరాలలో ముంపునకు గురయ్యాయని తెలిపారు. సార్వా వరి ఊడ్పులు 1,216 ఎకరాలలో పూర్తికాగా వాటిలో సుమారు 1,136 ఎకరాలు నీట మునిగాయని తెలిపారు. ఛానమిల్లి, అడవికొలను, సిద్దాపురం, క్రొవ్విడి, బావాయిపాలెం, ఎనికేపల్లి, భవ్వనపల్లి గ్రామాలలో ముంపు నష్టం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. సిబ్బంది జ్యోతి, ప్రసాద్, హనుమంతు, పి. శ్రావణి, సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : వర్షానికి యర్రమిల్లిపాడు, నల్లమాడు, కంసాలిగుంట,గోపాలపురం, రామచంద్రాపురం. గొల్లగూడెం, గోపీనాధపట్నం, తిమ్మయ్యపాలెం, కొత్తగూడెం, అక్కుపల్లి గోకవరం గ్రామాల ఆయుకట్టులో వర్షం నీరు రహదారుల మీద ప్రవహిస్తుంది. నాచుగుంట ఆయుకట్టులోని ముంపు పొలాలను టీడీపీ నేత ఇమ్మణ్ణి గంగాధరరావు, మాజీ ఎంపీపీ చిట్టూరి హరిబాబుతో కలిసి పరిశీలించారు. అలాగే ముంపునకు గురైన కైకరం ఆయుకట్టులోని పంట పొలాలను ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి పెట్టారని పంట కుళ్లి పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మురుగు కాల్వలు తవ్వకం జరగక పోవడం వలన ముంపునకు కారణమని ఆరోపించారు.

● భీమడోలు : అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో ఇప్పటి వరకూ సుమారు 700 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు ఎఓ ఉషారాణి తెలిపారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ శివారు ప్రాంతాల్లో వరి పంటలో వర్షం నీరు చేరిందని నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్నామని ఎవో తెలిపారు. ఇప్పటి వరకూ 700 ఎకరాల్లో వరి సాగు నీట మునిగిందని నష్టాలపై ప్రాథమిక అంచనాలు చేపడుతున్నామని తెలిపారు. నీట మునిగిన వరి పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు, సూచనలు, సలహాలు పాటించాలని ఈ సందర్భంగా ఎవో సూచించారు.

వర్షాలకు పడిపోయిన పొగాకు బ్యారన్

బుట్టాయగూడెం :వర్షాలకు రైతులు తలారి సామ్యూల్, తలారి ఏసురత్నంకు చెందిన వర్జీనియా పొగాకు బ్యారన్ శనివారం పడిపోయింది. సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం, పొగాకు బోర్డు ఆదుకోవాలని కోరుతున్నారు.


లక్కవరంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్


కొట్టుకుపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న బుట్టాయగూడెం వ్యవసాయాధికారి ముత్యాలరావు


ఉంగుటూరు ఆయూకట్టులో ముంపులో ఉన్న పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు,వ్యవసాయాధికారులు


వర్షానికి నీటమునిగిన నారుమడులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారులు

ఆదుకుంటాం

పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

జంగారెడ్డిగూడెం, జూలై 20 : మండలంలో ఎర్ర కాలువ ఉధృతికి నీట మునిగిన పంటలను చింతలపూడి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. భారీగా వరద నీరు రోడ్లపైకి రావడంతో లక్కవరం, పంగిడిగూడెం రహదారులు కోతకు గురికావడంతో ద్విచక్ర వాహనంపై వెళ్ళి పంట పొలాలను పరిశీలించారు. వ్యవసాయాధికారులను పంట నష్టం వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్కవరానికి చెందిన మత్స్యకారులు తమకు ఇవ్వాల్సిన చేపల చెరువును వేలం వేయకుండా వేరేవారికి కట్టబెట్టారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని మత్స్యకారులకు 20 రోజుల్లో న్యాయం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కె.స్లీవ జోజి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి పోసారావు, ఈఓ పి.నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గద్దే బాబీ, చిక్కాల ఆంజనేయులు, ముళ్ళపూడి శ్రీను జనసేన నాయకులు చిన మునసబు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : మండలంలోని విప్పలపాడు, రేగులకుంట, కోటనాగవరం, సీతప్పగూడెం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరి నారుమడులు 55 ఎకరాలు, వరి నాట్లు 75, పత్తిపంట 35 ఎకరాల్లో నీట మునిగినట్లు తెలిపారు. రైతులు వరి, ప్రత్తి చేలల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలాన్నారు. చిన్న చిన్న కాల్వల ద్వారా నీటిని బయటకు పంపాలన్నారు. నారుమడి ఐదు రోజులకంటే ఎక్కువగా నీటిలో ఉంటే దెబ్బ తింటుందన్నారు. నీటిని పూర్తిగా తీసివేసి రెండు కిల్లో యూరియా, కిలో పోటాష్ వేసుకోవాలని సూచించారు. ఒక గ్రాము కార్బెండిజమ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పిలక దశలో ఉన్న పంటకు ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్ వేసుకోవాలని సూచించారు.

● కుక్కునూరు : వర్షాలకు దెబ్బతిన్న నారు మడులను, పత్తి పంటలను వ్యవసాయాధికారి బాలాజీ పరిశీలించారు. పంట పొలాల్లో నీరు నిలబడితే కాల్వల ద్వారా బయటకు పంపాలని, తేమ నివారణకు తీసుకోవల్సిన చర్యలు వివరించారు.

● ఉంగుటూరు : మండలంలోని రావులపర్రు, నాచుగుంట, గొల్లగూడెం, ఉంగుటూరు గ్రామాల ఆయుకట్టులో మార్టేరు శాస్త్రవేత్తలు, ఏడీఏ బృందం నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్తల బృందం వద్ద తమకు జరిగిన నష్టంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోయారు. దీంతో మండల టీడీపీ అధ్యక్షుడు పాతూరి విజయకుమార్ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి శాస్త్రవేత్తతో మాట్లాడించగా రైతులకు విత్తనాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు మాట్లాడుతూ రైతులకు పరిహారం ఇచ్చేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏరువాక కేంద్రం (ఏలూరు) కో-ఆర్డినేటర్ కే.ఫణి కుమార్, ప్రిన్సిపాల్ సైంటిస్టు ఎం.గిరిజ, ఎస్.విరోనికా, శ్రీదేవి, భీమడోలు ఏడీఏ పి.ఉదషా రాజకుమారి, మండల వ్యవసాయాధికారి బాలిన వెంకటేష్, సర్పంచ్ బండారు సింధు మధు, పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు


జిల్లా ఎస్పీ శివకిశోర్‌ని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

ఏలూరు క్రైం, జూలై 20 : ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌ను జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శనివారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.లక్ష్మీనాయక్, శ్రీవాణీభాయ్, బి.బ్రహ్మయ్య కోనేరు సీతారామ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బి.రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, కందుల శ్రీకృష్ణ దత్తు, సీహెచ్ రాజేంద్ర ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూ టౌన్ :** పత్తేబాద, వన్‌టౌన్ రైతు బజారుల్లో మొదటి రకం టమాట రూ.56లు, రెండో రకం రూ.40కి విక్రయిస్తున్నారు.
- ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని వాయిదా వేశారు. ఎప్పుడు నిర్వహించేంది త్వరలో ప్రకటిస్తారు.
- **ద్వారకాతిరుమల :** : వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు పదివేల మందికి పైబడి భక్తులు ద్వారకాతిరుమల చిన్న వెంకన్నను శనివారం దర్శించుకున్నారు.
- **ఏలూరు అర్బన్ :** మూడు రోజులుగా సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ ప్రోలైఫ్ కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది.
- భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు శనివారం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఏలూరులోని ప్రైవేటు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులను యదాతథంగా నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.
- **బుట్టాయగూడెం :** జిల్లా కలెక్టర్ స్కూళ్లకు సెలవు ప్రకటించినా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలకు సెలవు ఇవ్వకపోవడం ఏమిటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు జలగం రాంబాబు, సోడెం రాజు, పాయం పోశయ్య, కంగాల వెంకటేశ్వరావు, బొరగం రెడ్డిదొర తదితరులు ప్రశ్నించారు.
- **పెదవేగి :** తలసేమియా బాధిత చిన్నారుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.
- **దెందులూరు :** : గాలాయగూడెం అచ్చమ్మ పేరాంటలమ్మతల్లి ఆలయానికి ఆదే గ్రామానికి చెందిన పూజారి వెంకటేశ్వరావు(టాపీమేస్త్రీ) వెంకన్న ఆదిలక్ష్మీ దంపతులు రూ.45 వేలు విలువ చేసే హుండీని బహుకరించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలోని షిరిడీ సాయి మందిరాలు ఆదివారం నిర్వహించనున్న గురుపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు సామూహిక తులసీదళాలతో అర్చనలు జరిపారు. పుష్పార్చన నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో పౌర్ణమి నేపథ్యంలో బాల త్రిపుర సుందరిదేవి అమ్మవారికి, షిరిడీ సాయినాధ ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు.

తమ్మిలేరులో పేరుకుపోయిన డెక్క

ఏలూరు రూరల్, జూ లై 20: తమ్మిలేరు కాలువలో గుర్రపు డెక్క పేరుకు పోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. వర్షపు నీరు పొంగి ప్రవహిస్తూ ఉండడంతో పంట పొలాలు మునిగిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో డ్రైన్లకు మరమ్మతులు ముందస్తు పనులు చేపట్టక పోవడంతో గుర్రపు డెక్క, కలుపుజాతి మొక్కలు పేరుకుపోయిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తమ్మిలేరుకు వరదనీరు పెరుగుతుండటంతో శనివారపుపేట కాజ్‌వే వద్ద నీటి ప్రవాహాన్ని గుర్రపు డెక్క అడ్డుకుంటోంది. వెంటనే గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● ఏలూరు క్రైం : ఏలూరు నగరానికి సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద తమ్మిలేరుకాలువ రెండుగా చీలిపోయి ఒకటి తంగెళ్ళమూడి మీదుగా, రెండోపాయ శనివారపుపేట మీదుగా కొత్తబస్టాండ్ సమీపం నుంచి వెళ్తుంది. ఈ కాలువలపై ఉన్న బ్రిడ్జిల వద్ద నీటి ప్రవాహం చూడడానికి ప్రజలు గుంపులు, గుంపులుగా చేరిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పోలీసులు పురాతనమైన పడమర లాకుల బ్రిడ్జి వద్ద జనం ఎక్కువగా ఉండడంతో వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి తన సిబ్బందితో అక్కడ చేరుకుని బ్రిడ్జిపైన ఉన్న వారిని పంపించి వేశారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించండి


డీఐజీకి ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, జూలై 20: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో శాంతి భద్రతలపై పోలీసు ఉన్నతాధికారుల దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌ను కోరారు. ఏలూరులో శనివారం వారిద్దరిని ఆయన కలసి చినవెంకన్న ప్రసాదాలను, పుష్పగుచ్చాన్ని అందించారు. క్షేత్రంలో తమ వంతు సహకారం పోలీసులకు అందిస్తామని ఎమ్మెల్యే వెంకట్రాజు స్పష్టం చేశారు.

అన్న క్యాంటీన్‌కు రూ.29 లక్షలు మంజూరు

జంగారెడ్డిగూడెం, జూలై : అన్న క్యాంటీన్ పనులకు రూ.29 లక్షలు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్ తెలిపారు. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.14 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షలని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసి క్యాంటీన్ ప్రారంభించడానికి ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ రెనోవేషన్ పనులను శనివారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి తూటిగుంట రాము, కౌన్సిలర్లు నాయకులు పి.పండు, చెరుకూరి శ్రీధర్, మున్సిపల్ ఏఈ సంధ్య, మేనేజరు వెంకటరమణ, అన్న క్యాంటీన్ కాంట్రాక్టర్ కొండ్రెడ్డి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపునకు చర్యలు

ఏలూరు టూ టౌన్, జూలై 20: వర్షాలకు పలు చోట్ల నీరు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే చంటి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ వర్షపు నీటిని బయటకు పంపేందుకు శ్రమిస్తున్నారు. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికి కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తూ డ్రైన్లను శుభ్రం చేసి వర్షపు నీటిని బయటకు తరలిస్తున్నారు. ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు సంజీవరావు, వేణుగోపాలస్వామి, పారిశుధ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇంటికి మంత్రి పార్థసారథి


మంత్రి పార్థసారథితో మాజీ ఎమ్మెల్యే మురళీ, సత్తిపండు

జంగారెడ్డిగూడెం, జూలై 20 : మంత్రి కొలుసు పార్థసారథి శనివారం స్థానిక టిడిపి నాయకుడు పరిమి సత్యనారాయణ (సత్తిపండు) ఇంటికి విచ్చేశారు. వేలేరుపాడులో వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన అనంతరం తిరిగి వెళ్తూ సత్తిపండు ఇంటివద్ద కొద్దిసేపు ఆగి వెళ్లారు. మంత్రితో పాటు చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ ఉన్నారు.

కొట్టుకుపోయిన కల్వర్టు


కొట్టుకుపోయిన ఎర్రాయిగూడెం కల్వర్టు

బుట్టాయగూడెం, జూలై 20 : ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల కల్వర్టులు, లోలెవల్ వంతెనలు పూర్తిగా దెబ్బతినడంతో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కేఆర్‌పురం తూర్పు వాగు పొంగి ఉధృతంగా ప్రవహించడంతో ఎర్రాయిగూడెం వద్ద వాగుపై నిర్మించిన కల్వర్టు కొట్టుకు పోయింది. దీంతో ఎర్రాయిగూడెంతోపాటు మరో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సమయాల్లోను ఐటీడీఏ, మండల కేంద్రానికి రావాలంటే గ్రామస్తులకు ఇదొక్కటే మార్గం. లేదంటే సుమారు 10 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావడంతో పాటు కేఆర్ పురం వద్ద తూర్పు వాగును దాటాలి. వాగుపై కల్వర్టును నిర్మించే సమయంలోనే వంతెన కావాలని గ్రామస్తులు కోరినా అధికారులు తూరలతో కల్వర్టును నిర్మించి చేతులు దులుపుకున్నారు. తూరలు కారణంగా తుక్కు అడ్డుపడి కల్వర్టు కొట్టుకు పోయింది. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు కూరం సత్యనారాయణ, మడకం వెంకటేశ్వరావు, కూరం దుర్గారావు, మడకం సూర్యచంద్రం కోరుతున్నారు.

రోడ్డుపై కూలిన వృక్షం



లింగపాలెం, జూలై 20: భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఏలూరు, చింతలపూడి ప్రధాన రహదారి పై ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్ దగ్గర్లో ఓ వృక్షం కూలి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ చెన్నారావు, ఇతర డిపార్ట్‌మెంట్‌లు, గ్రామస్తుల సహకారంతో వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

‘అత్తులూరి’ సేవలు ప్రశంసనీయం

ఏలూరు కార్పొరేషన్, జూలై 20 : కార్మికుల అభ్యున్నతికి సీపీఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అత్తులూరి సర్వేశ్వరరావు అందించిన సేవలు ప్రశంసనీయమని అదే స్ఫూర్తి నేటి నాయకులు కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అత్తులూరి సర్వేశ్వరరావు 43వ వర్ధంతిని శనివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలు సెంటర్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఏలూరు పట్టణ పొగాకు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జరిపారు. అత్తులూరి చిత్రపటానికి, స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పొగాకు కార్మిక సంఘ నాయకులు రొంపెల్ల నవీన్‌కుమార్, పాలేటి సత్యనారాయణ, పసుపులేటి దుర్గారావు, తోట బాజి, తదితరులు పాల్గొన్నారు.



బలివే వద్ద తమ్మిలేరులో వరదను పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీశంకరి



ఉప్పరగూడెం వద్ద పొంగిన పెదలంక మేజర్ డ్రెయిన్



చిన్నంపేట కాజ్‌వే వద్ద వరదను పరిశీలిస్తున్న అధికారులు



నెక్కలం గొల్లగూడెంలో కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఉధృతంగా తమ్మిలేరు

- ఒక్కప్రాణ నష్టం కూడా జరగనివ్వద్దు: అధికారులకు ఆర్డీవో సూచన
- పలుచోట్ల కూలిన చెట్లు, ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ముసునూరు, జూలై 20 : తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని నూజివీడు ఆర్డీవో భవానీశంకరి ఆదేశించారు. శనివారం బలివే వద్ద తమ్మిలేరులో వరద ఉధృతిని ఆమె పరిశీలించి మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో మరో మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా అన్నిశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ్మిలేరు పరీవాహక గ్రామాలైన లోపూడి, గుడిపాడు, గుళ్ళపూడి, యల్లాపురం, బలివే తదితర గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక నిఘా పెట్టి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ్మిలేరులోకి చేపల వేటకు, ఈతకు వెళ్ళవద్దని కోరారు. గ్రామాల్లో ఏమైనా సంఘటనలు జరిగితే స్థానికులు వెంటనే తహసీల్దార్, ఎంపీడీవోలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అధికారులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. తహసీల్దార్ జవహర్ బాజీ, వీఆర్వో మణేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

అల్పపీడనం ప్రభావంతో ఈదురుగాలులతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మండల వ్యాప్తంగా 16 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని ట్రాన్స్‌కో ఏఈ ఆకుల హేమసుందర్‌రావు తెలిపారు. అలాగే సూరేపల్లి, చింతలపల్లి, గోపవరం తదితర గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లు రహ దారులకు అడ్డంగా కూలిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం రహదారులకు అడ్డుగా పడిన చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఆగిరిపల్లి: నెక్కలం గొల్లగూడెం సమీపంలో నూజివీడు-విజయవాడ రహదారిపై భారీ వృక్షం శనివారం ఉదయం నేలకొరిగింది. రహదారికి అడ్డంగా పడడంతో తక్షణం నెక్కలం గొల్లగూడెం కుశలవ కంపెనీ, గొల్లగూడెం సబ్‌స్టేషన్ సిబ్బంది సహకారంతో రెండు ఎక్స్‌కవేటర్లతో వృక్షాన్ని తొలగించారు.

చాట్రాయి: తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరూ తమ్మిలేరులో దిగకుండా పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీ, ఏఎస్సై గజపతిరావు చెప్పారు. శనివారం చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని వారు పరిశీలించి మాట్లాడుతూ ప్రజలు ఎంత అత్యవసర పనులున్నా తమ్మిలేరును దాటే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. పశువులు వరదలోకి దిగినా కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నదని, వరద తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పొంగుతున్న మేజర్ డ్రెయిన్లు

ముదినేపల్లి: ముదినేపల్లి ప్రాంతంలోని డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. మేజర్ డ్రెయిన్ల కింది భాగంలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన కిక్కిస, గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. పెదలంక, పెదకొమ్మిలేరు మేజర్ డ్రైన్లతో పాటు అన్నవరం, ఊటుకూరు మీడియం డ్రెయిన్ల కింద పొలాల్లో ముంపు పెరుగుతోంది. వెదజల్లిన వరి పొలాలు అయిదు రోజులుగా ముంపులోనే ఉండిపోయాయి. లేత దశలో ఉన్న వరి పైరు కుళ్లిపోయే పరిస్థితిలో ఉంది. ముదినేపల్లి మండలంలో వందలాది ఎకరాల్లో ముంపు బారిన పడ్డాయి. పెదలంక మేజర్ డ్రెయిన్‌లో దేవపూడి - ఆవకూరు మధ్య పెరిగిన కిక్కిస తొలగింపులో జాప్యం వల్ల ముంపు మరింత పెరిగే అవకాశాలున్నాయి. మూడేళ్లుగా కిక్కిస పెరుగు తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవటం వల్ల ముంపు సమస్యను ప్రతిఏటా ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. వెదజల్లేందుకు ఇప్ప టికే ఎకరానికి రూ.8 వేలు పెట్టుబడి పెట్టామని, ముంపు వల్ల పైరు పాడైపో తున్నదని ముదినేపల్లికి చెందిన కౌలు రైతు ఉప్పల రాజా ఆవేదన వ్యక్తం చేశారు.



పెరుగుతున్న తమ్మిలేరు జలాశయం

ఏలూరు సిటీ/చింతలపూడి, జూలై 20: చింతలపూడి సమీపం లోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియాతోపాటు ఎగువ తెలంగాణ నుంచి వస్తున్న వరద నీరు చేరి శనివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 344.24 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 3,426 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. రెండు రోజుల్లో తొమ్మిది అడుగుల నీరు పెరిగింది. 355 అడుగులకు చేరితే వరద నీరు దిగువకు విడుదల చేస్తారు. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు కాగా ఇప్పటికి 1.337 టీఎంసీలు నీరు చేరిందని ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు. ఇప్పటికే చాట్రాయి మండలంలో తమ్మిలేరు వరద కొనసాగుతోంది. ఎర్రకాలువ కొంత వరకు శాంతించింది. కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు వద్ద నీటిమట్టం 81.88 మీటర్లు కాగా ఎగువ ప్రాంతాల నుంచి 8,655 క్యూసెక్కులు నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతుండడంతో 10,696 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సారథి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, జూలై 20: భారీవర్షాల కారణంగా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల వివరాలు, చేపడుతున్న చర్యలపై ప్రభుత్వ అధికారులతో శనివారం ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి, ఇరిగేషన్ డీఈ సత్యనారాయణతో మాట్లాడుతూ ముసునూరు, చాట్రాయి, నూజివీడు మండలాల పరిధిలోని వాగులు, పంట కాలువల పరిస్థితిపై ఆరా తీశారు. పంటనష్టం ఎంత మేర ఉంటుందో తెలుసుకున్నారు. రహదారులపై కూలిన భారీ వృక్షాలు తొలగించాలని ఆదేశించారు. అతిసార, విష జ్వరాలు రాకుండా జిల్లా వైద్య అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ముందస్తుగా మందులు పంపిణీ చేపట్టాలని సూచించారు. అలాగే విద్యుత్ స్తంభాలు పడిపోవడం, విద్యుత్‌వైర్లు తెగి ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, అలాంటి సంఘటనలు జరగకుండా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పశువులకు ప్రాణనష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ వర్షాలను తట్టుకునే శక్తి మన చెరువులకు ఉందా? అని ప్రశ్నించగా ఇంకా రెండు రోజులు వర్షాలు కురిసినా తట్టుకునే సామర్థ్యం నియోజకవర్గంలోని చెరువులకు ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఎటువంటి ఆస్తి, పంట నష్టం జరగలేదని అధికారులు మంత్రికి వివరించారు. ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం తనకు తెలియచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ, విద్యుత్, మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరిస్తున్నాం..

నూజివీడు పట్టణ వాసులకు సురక్షిత కృష్ణా నీటిని అందిస్తున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. మూడేళ్లుగా కృష్ణానది తాగు నీటి స్టోరేజ్ ట్యాంకు శుద్ధి యంత్రాలను శుభ్రం చేయకుండా గత పాలకులు గాలికి వదిలేసి కలుషిత నీటిని నగర ప్రజలకు అందిస్తుండటంతో ఆ నీరు తాగి రోగాల బారిన పడ్డామని పట్టణ వాసులు తన దృష్టికి తేవడంతో శుద్ధిచేసిన తరువాతే తాగునీటిని ప్రజలకు అందించాలని నూజివీడు మున్సిపల్ కమిషనర్‌ను హెచ్చరించిన 24 గంటల్లో యంత్రాలను శుభ్రపరిచి, పురపాలక సిబ్బంది శుభ్రంచేసిన స్వచ్ఛమైన నీరును శుక్రవారం నుంచి అందిస్తున్నారని మంత్రి తెలిపారు. మరోసారి ఇలాంటి సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తేవాలని నూజివీడు పట్టణ ప్రజలకు మంత్రి సూచించారు.



విజయ్‌సాయిరెడ్డి వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

విజయసాయి రెడ్డి రాజీనామా చేయాలి

నూజివీడు టౌన్, జూలై 20: ఎంపీ విజయ సాయి రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తన పదవికి రాజీనామా చేసి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు నూతక్కి వేణుగోపాల్‌రావు డిమాండ్ చేశారు. శనివారం నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో మీడియాపై విజయసాయి రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ విలేకర్లు నిరసన ప్రదర్శన చేశారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. టీడీపీ నాయకులు అక్కినేని చందు, పర్వతనేని సాయి, కాంగ్రెస్ నాయకుడు గోళ్ల పవన్, జనసేన నాయకులు తోట వెంకట్రావ్, బొబ్బిలి శ్రీకాంత్, సూరిశెట్టి శివ పాల్గొన్నారు.

మామిడి రైతుల సదస్సు వేదిక మార్పు

నూజివీడు టౌన్, జూలై 20: భారీ వర్షాల నేపథ్యంలో మామిడి రైతుల సదస్సును మామిడి పరిశోధన కేంద్రం స్థానంలో బదులు అమర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి అమర్‌భవన్‌లో మామిడి సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు.

వసతి గృహం సిబ్బందిపై ఆర్డీవో అసహనం

ముసునూరు, జూలై 20: ముసునూరులో ఎస్సీ బాలికల వసతిగృహాన్ని నూజివీడు ఆర్డీవో భవానీశంకరి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం నాణ్యతపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు, బాలికల తల్లిదండ్రుల నుంచి సిబ్బందిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ముఖ్యంగా బాలికల రక్షణపై సిబ్బంది పనితీరు బాగోలేదని సిబ్బందిపై ఆర్డీవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ, బాలికల రక్షణపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ జవహర్‌బాజీ, ఏస్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కామినేనికి వినతిపత్రమిస్తున్న చేపల సంఘం నాయకులు

ఆక్వా సాగులో కోళ్లవ్యర్థాల నిర్మూలన : కామినేని

కైకలూరు, జూలై 20: ఆక్వా సాగులో కోళ్ళ వ్యర్థాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరులో కోళ్ళ వ్యర్థాల రవాణాను నివారించాలని రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు ఆధ్వర్యంలో కామినేనికి వినతిపత్రాన్ని అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ కోళ్ళవ్యర్థాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కామినేని అన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో కోళ్ళ వ్యర్థాల నివారణపై చర్యలు తీసుకోవాలని ఫోన్లో కోరారు. ఆక్వా అభివృద్ధితోనే లక్షలాదిమందికి ఉపాధి దొరుకుతుందని దాని మనుగడకు నష్టం వాటిల్లితే సహించేది లేదని హెచ్చరించారు. ఏయే ప్రాంతాల్లో కోళ్ళవ్యర్థాలతో సాగు జరుగుతోందో ఆయా ప్రాంతాల్లో రైతులు సమాచారాన్ని అధికారులకు అందజేయాలన్నారు. చేపల రైతులు యలకటూరి రవీంద్రబాబు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఈ శ్రీనివాస్, టీకేఎం నాని, పేరిచర్ల ప్రసాదరాజు, ముదునూరి కొండరాజు, పైడిపాటి శివశంకర్, గుడివాడ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

చాట్రాయి, జూలై 20: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ లంకా నిర్మల, జడ్పీటీసీ చెలికాని అనూష కోరారు. శనివారం జరిగిన చాట్రాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ విస్సన్నపేట మండలం రామచంద్రాపురం వద్ద ఎన్నెస్పీ రెగ్యులేటర్ గేట్లు మరమ్మతులు చేయించాలని, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని సభ్యులకు తెలియజేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ సీజనల్ జ్వరాల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు ముందు జాగ్రత్తలు పాటించాలని, రైతులంతా పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలని, కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 3005 కిట్స్ వచ్చాయని, గత ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్ కింద 50 పనులు మంజూరు కాగా 21 పనులు పూర్తయ్యాయని వివరించారు. మండలంలో 119 సాగునీటి చెరువులు ఉండగా దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు అంచనాలు తయారు చేస్తున్నామని, మండలంలోని అటవీ భూముల్లో సగం వరకు ఆక్రమణలకు గురయ్యాయని, ప్రజాప్రతినిధులు ఆక్రమణను నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో మంగాకుమారి, తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీ, వైద్యాధికారి విజయలక్ష్మి, సూపరింటెండెంట్ మురళీమోహన్ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఏవో మధుమోహన్

సీజనల్ వ్యాధులు ప్రబలనివ్వద్దు

ముసునూరు, జూలై 20: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా సూచించారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో వివిధ శాఖల పనితీరు, అమలు చేసే పథకాలను అధికారులు వివరించారు. వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ ప్రతాప్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం అందిస్తున్న మందులను బాధితులకు ఇవ్వాలని వైద్యాధికారిణి షకీనా ఇవాంజలికి సూచించారు. అలాగే వివిధ దశల్లో ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తిచేసేలా చూడాలన్నారు. లోపూడి ఫారెస్ట్‌లో కొంత భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు సర్వే చేసి, ఆ భూమి ఎవరిదో నిర్ధారించాలన్నారు. రమణక్కపేట సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే పలు గ్రామాల్లో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు వేయాలని చెప్పినా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. నూజివీడు ఆర్డీవో భవానీశంకరి మాట్లాడుతూ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ జవహర్ బాజి, వైస్ ఎంపీపీ-2 పాముల గంగాధరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

టీటీడీకి కూరగాయల వితరణ



నూజివీడు, జూలై 20: పెద్ద తిరుపతిలోని వెంగమాంబ నిత్యాన్నదాన సత్రానికి నూజివీడు రైతులు కూరగాయల వితరణ జూలై నెలలోనూ కొనసాగించారు. ప్రతి నెలా తిరుమల తిరుపతి దేవస్థానం సత్రానికి, విజయవాడ దుర్గమ్మ నిత్యాన్న కార్యక్రమాలకు నూజివీడు, దేవరగుంట రైతులు కూరగాయలను వితరణ చేస్తున్నారు. శనివారం దాతలు అందించిన 12 టన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనంలో టీటీడీకి పంపించారు. అలాగే విజయవాడ దుర్గమ్మ ఆలయానికి టన్నున్నర కూరగాయలను పంపినట్టు దాతల ప్రతినిధి నక్కా సత్యనారాయణ తెలిపారు.

ఉద్యాన పంటలను రక్షించండి

నూజివీడు టౌన్, జూలై 20: భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యాన పంటల్లో చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హెచ్‌వో ఆర్.హేమ అన్నారు. దేవరగుంట, జంగంగూడెం గ్రామాల్లో ఉద్యాన పంటలను ఆమె పరిశీలించి మాట్లాడుతూ భారీ వర్షాలతో సూక్ష్మ పోషకాల లోపం ఏర్పడుతుందని, దీన్ని అధిగమించేందుకు జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో, బోరాన్ 1 గ్రాము లీటర్ నీటిలో, యూరియా 10 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 20 రోజులు వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. అక్షింతల పురుగు క్లోరోఫైరిపాస్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి, ఎండు తెగులు నివారణకు కాపారాక్సిక్లోరైడ్ 3 గ్రాములు, బూజు తెగులు నివారణకు కార్బండిజం ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.



కూటమి సహకారంతో రహదారి మరమ్మతులు

కలిదిండి, జూలై 20 : అధ్వానంగా ఉన్న కాళ్లపాలెం ప్రధాన రహదారికి కూటమి నాయకులు శనివారం స్వచ్ఛందంగా మరమ్మతులు ప్రారంభించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల చినుకు పడితే వణుకే శీర్షికన ప్రచురితమైన కథనానికి కూటమి నాయకులు స్పందించారు. కాళ్లపాలెం ప్రధాన రహదారిపై గోతులను ఎక్స్‌వేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులు నల్లజర్ల సత్యనారాయణ, పేటేటి కనక లింగేశ్వరరావు, వి. పూర్ణచంద్రరావు, వి. సుభాషిణి, యర్రంశెట్టి ప్రసాద్, మేడిశెట్టి వెంకట రత్నం, నల్లజర్ల మహేష్, మర్రే ఆనంద్, గురజ మణి, పణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి చొరవతో డ్రెయిన్ల పూడికతీత

చాట్రాయి, జూలై 20: చీపురుగూడెం శివారు మంగపేటలో కచ్చా డెయిన్లు పూడిపోయి నివాస ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో టీడీపీ నాయకుడు సమస్య పరిష్కరించారు. టీడీపీ ఎన్నారై విభాగం నాయకుడు బొట్టు వంశీ సొంత నిధులతో ఎక్సకవేటర్ ఏర్పాటు చేసి డ్రెయిన్లలో పూడిక తొలగించారు. తమ సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికల సంరక్షణపై దృష్టి పెట్టాలి

మండవల్లి జూలై 20 : బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండవల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజరు నాగలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మూడుతాళ్లపాడు, ఇంగిలిపాకలంక అంగన్వాడీ కేంద్రాల పరిధిలో శనివారం జరిగిన బాలికల సంరక్షణ అవగాహన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి బాలికల సంరక్షణ కోసం అనేక సేవలందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోకుమూడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమ, ఎంఎల్‌హెచ్‌పి శైలజ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

మొగల్తూరు, జూలై 20: కుటుంబంలోని దంపతుల మధ్య ఆర్థిక లావాదేవీలతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలివి.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పేరూరు గ్రామానికి చెందిన గురజాడ అప్పారావు(32) మొగల్తూరు మండలంలోని కొత్తపాలెం గ్రామంలో అతడి అత్తవారింటవద్దనే గత పన్నెండేళ్లుగా నివాసం ఉంటున్నాడు. భార్య కువైట్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరి మధ్య ఆర్థిక అంశాలకు సంబంధించి వివాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన అప్పారావు శనివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పొలాల్లో నీటిని తొలగించండి



వింజరంలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చాట్రాయి, జూలై 20: ఎడతెరిపిలేని వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు కాపాడుకోవాలని తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీ, ఏవో శివశంకర్ కోరారు. శనివారం చాట్రాయి, నరశింహారావుపాలెం, చనుబండ గ్రామాల్లో అధికారులు పర్యటించి వరినారు మళ్ళు, వెదజల్లిన వరిపైరు, పత్తి, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో మాట్లాడుతూ పొలాల్లో నిలిచిన వర్షం నీటిని కాలువల ద్వారా బయటకు పంపాలని, నీరు చేరిన వరినారు మళ్ళు కోలుకోవటానికి యూరియా 1కేజీ, పొటాష్ 1కేజీ చల్లుకుని సమస్య అధిగమించవచ్చునని సూచించారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

ఆగిరిపల్లి: అల్పపీడనంతో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు సగ్గూరు, కృష్ణవరం తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు శనివారం పరిశీలించారు. రైతులంతా పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలని, అలాగే నేరుగా విత్తిన పొలాల్లో నీరు నిల్వఉంటే నీటిని తొలగించిన తరువాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్‌ను వేసుకుని లీటరు నీటికి రెండు గ్రాముల మ్యాంకోజెబ్ లేదా రెండు గ్రాముల కార్బండిజం మందును పిచికారి చేసి తెగుళ్ళ నుండి వరి పంటను రక్షించుకోవాలని తెలియజేశారు.

కైకలూరు: వరి రైతులు పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఆర్. గంగాధరరావు అన్నారు. శనివారం ఆచవరం, వింజరం, శ్యామలాంబపురం, తామరకొల్లు గ్రామాల్లో పొలాలను పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షం వలన పంటలకు ఎలాంటి నష్టం లేదని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. వర్షాలు తగ్గిన తరువాత నీటిని బయటకు తీసి ఎకరానికి 20 కిలోలు యురియా, 10 కిలోలు పోటాష్ ఎరువును బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. పైరు కోలుకున్న తరువాత తెగుళ్ళ ఉంటే మందులు పిచికారి చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిని ఆర్. దివ్య, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.



రహదారిపై చెరువు

ఆగిరిపల్లి, జూలై 20: భారీ వర్షాలకు తోటపల్లి గ్రామంలో రహదారిపై నిలిచిన నీరు చెరువును తలపిస్తోంది. గత ప్రభుత్వ నాయకుల అలసత్వమే ఈ దుస్థితికి కారణమని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఆ మార్గాన వెళ్ళే వాహనదారులు రహదారిపై గల గోతులోపడి ప్రమాదాల పాలవుతున్నారు.

స్కూల్ కాంప్లెక్సుల పునర్వ్యవస్థీకరణ

ముదినేపల్లి, జూలై 20 : స్కూల్ కాంప్లెక్సల పునర్వ్యవస్థీకరణను విద్యాశాఖ చేపట్టింది. ప్రస్తుతం స్కూల్ కాంప్లెక్స్, దాని అనుబంధ పాఠశాలల వివరాలను పంపాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు డీఈవో అబ్రహం ఎంఈవోలను ఆదేశించారు. కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించే పాఠశాలలకు అనుబంధ పాఠశాలలకు మధ్య ఉన్న దూరం వివరాలను పంపాలని డీఈవో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌ల్లో మార్పులు చేసి అనుబంధ పాఠశాలలను కాంప్లెక్స్ స్కూలుకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. వచ్చే నెలలో జరుగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నాటికి మార్పులు, చేర్పులు చేయనున్నట్లు తెలిసింది.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

ముదినేపల్లి, జూలై 20 : ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలోని శ్రీ షిర్డి సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. బాబాకు అఖండ దీపారాధన, కాగడ హారతి నిర్వహించి భక్తులు అభిషేకాలు, పూజలు జరిపారు. ఏకాహం నిర్వహించారు.

పోలవరంలో డీఈఈ రహదారి పరిశీలన



చాట్రాయి, జూలై 20: మండలంలోని పోలవరం గ్రామ పరిధిలోని, పోలవరం-రమణక్కపేట రహదారి పెద్ద పెద్ద గోతులు పడి అధ్వానంగా మారటంతో ప్రజలు, వాహనచోదకులు నరక యాతన అనుభవిస్తున్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు రోడ్డు దుస్థితిని అధికారుల దృష్టి తేవటంతో శనివారం నూజివీడు ఆర్‌అండ్‌బీ డీఈఈ బాబూరావు రహదారిని పరిశీలించారు. రహదారి గోతుల్లో వర్షం నీరు నిలిచి అపరిశుభ్రత తాండవించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు డీఈఈకి వివరించారు. త్వరలోనే రహదారులకు అవసరమైన మరమ్మత్తులు చేయించి సమస్య పరిష్కరిస్తామని డీఈఈ హామీ ఇచ్చారు.

రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు

ముసునూరు, జూలై 20: బలివేలోని రాజరాజేశ్వరి అమ్మవారికి ఆసాఢ మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలివే, వెంకటాపురం గ్రామాల మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పట్టు వస్త్రాలు సమర్పించి, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమరబాబు, ఈవో ఎన్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.